
షేర్‌మార్కెట్‌లో లాభాలంటూ
రూ.కోటికి కుచ్చుటోపీ
● పోలీసులకు ఫిర్యాదుతో రూ.24 లక్షలు రికవరీ
యువతికి తెలియకుండానే పర్సనల్ లోన్
● రూ.5 లక్షలు నొక్కేసిన సైబర్ నేరగాళ్లు
7 లో



మల్లన్న ఆలయంలో వేలంపాట

● ఒడిబియ్యం, వస్త్రాలు, బండారి సేకరణకు రూ.59.10 లక్షలు
● కొబ్బరి ముక్కల సేకరణకు రూ.39.05లక్షలు ● తలనీలాలు సేకరణ వేలం వాయిదా

చేర్యాల, జూలై 23 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడిగా సమర్పించే శేషవస్త్రాలు, ఒడిబియ్యం, పసుపు పోగు చేసుకునే హక్కు కొమురవెల్లికి చెందిన వి.అశోక్‌రాజ్ రూ.59.10లక్షలకు, మల్లన్న, ఎల్లమ్మ ఆలయాల వద్ద కొబ్బరి ముక్కల సేకరణను ఐనాపూర్‌కు చెందిన మల్లం శ్రీనివాస్ రూ.39.05లక్షలకు, ప్రసాదాల ప్యాకింగ్ బాధ్యత పోతిరెడ్డిపల్లి చెందిన కె.నరేశ్ ఒక ప్యాకెట్ రూ.27చొప్పున దక్కించుకున్నారు. అలాగే తలనీలాల సేకరణ, ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయం, నిత్య అన్నదానసత్రం సమీపంలోని సులబ్ కాంప్లెక్స్‌కు సంబంధించి అనుకున్న మేర స్పందన రాకపోవడంతో వాయిదా వేశారు. వేలంపాటల్లో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్నారు.





వేలంపాటలు నిర్వహిస్తున్న ఆలయ ఈవో

కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు అభివృద్ధికి రూ.500 కోట్లు



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

● సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 23: సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి తెలిపారు. ఈ నిధులతో మహబూబ్‌సాగర్ సుందరీకరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. వీటిలో ప్రధానంగా అభివృద్ధి చేసే పనుల వివరాలిలా ఉన్నాయి.

1. మహబూబ్‌సాగర్ చెరువు కట్ట వెడల్పుతో పాటు చెరువు చుట్టూ నెక్లెస్ రోడ్డు ఏర్పాటు.
2. చెరువు మధ్యలో భారీ శివుడి విగ్రహం, చెరువు కట్ట వద్ద చిన్న పిల్లల పార్కు.
3. చెరువు కట్టపై వాకింగ్‌ట్రాక్, బతుకమ్మలు వదలడానికి అదనంగా మెట్ల నిర్మాణం.
4. చెరువు వద్ద ప్రత్యేకంగా హోటళ్లు, చెరువులో బోటింగ్ సౌకర్యం.
5. మురుగు నీటి తొలగింపుతో పాటు చెరువులోకి వచ్చే మురికి నీటిని తరలించేందుకు ప్రత్యేక కాల్వల నిర్మాణం.
6. చెరువు మధ్యలో ఉన్న సోమేశ్వరవాడ శివాలయం అభివృద్ధి.
7. చెరువు కట్టమీద ఉన్న చాకలి వారి మడేలమ్మ, బెస్తవారి మైసమ్మ గుడి, గాలి పోచమ్మ గుడితో పాటు షాదుల్లాహుస్సేన్ దర్గా అభివృద్ధి.
8. చెరువు కట్ట కింద ఉన్న కింది బజార్ మల్లన్న గుడి, బీరప్ప ఆలయాల అభివృద్ధి.
9. నెక్లెస్ రోడ్డు చుట్టూ 12 కిలోమీటర్ల మేర విద్యుద్దీపాల ఏర్పాటు.
10. నెక్లెస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న కల్వకుంట రైతులకు, మల్లన్న, బీరప్ప ఆలయాల కోసం భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లింపు.
11. కల్వకుంట, నాల్సాబ్‌గడ్డ, రిక్షాకాలనీ, సోమేశ్వరవాడల మీదుగా నెక్లెస్ రోడ్డుపై పార్కుల ఏర్పాటు.
12. చెరువు కట్టపై తూము దగ్గర బ్రిడ్జిలతో పాటు కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.

ఆరు నెలల్లో వెయ్యి!



● జిల్లాలో కుక్కకాటు బాధితులు
● ఎక్కడ చూసినా వీధి కుక్కల విజృంభణ
● బయటకు వెళ్లాలంటే భయపడుతున్న జనం



పట్టణంలోని ఓ వీధిలో మహిళపైకి వెళ్తున్న కుక్కలు (ఫైల్)

సిద్దిపేట టౌన్, జూలై 23: జిల్లాలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఎవరైనా ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నగరాల్లోనే కాదు.. పట్టణాలు, గ్రామాల్లో సైతం వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై గుంపులు గుంపులుగా దాడులకు పాల్పడుతున్నాయి. హైదరాబాద్‌లో మిరుదొడ్డి గ్రామానికి చెందిన నిహన్ (18నెలలు) వీధికుక్కల దాడిలో మృతి చెందినా అధికార యంత్రాంగం కుక్కల నియంత్రణ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. వీధి కుక్కలను జన్యుపరంగా కంట్రోల్ చేసేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఏనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాలు మూలనపడ్డాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విచ్చలవిడిగా వీధికుక్కలు తీవ్ర స్థాయిలో రెచ్చిపోతూ రోజురోజుకు ప్రజలపై ముప్పేటా దాడులు చేస్తున్నా, వాటిని నియంత్రించడంతో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

ఐదు నుంచి పది..

సిద్దిపేట పట్టణంలోని 43వార్డుల్లోని ఒక్కో కాలనీలో దాదాపు 5 నుండి 10 వీధి కుక్కలుంటున్నాయి. జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి జూలై 19 వరకు (ఆరున్నర నెలల్లో) వెయ్యికి పైగా కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని 33 పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రి, జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలో ప్రతి రోజు కుక్కకాటు, దాడులు చేసిన కేసులు వస్తున్నట్లు వైద్యవర్గాలు వెల్లడిస్తున్నారు. దాంతో పాటు రాత్రి సమయాల్లో వాహనదారులపై వీధికుక్కలు వెంటబడుతుండటంతో, ప్రాణాలు రక్షించుకుందామనే వేగంగా వాహనాలు నడపడంతో పలువురు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గొర్రెల మందలపై దాడులు చేయడంతో చనిపోతున్నాయి. దీంతో గొర్రెల పెంపకందారులు తీవ్ర ఆర్థికంగా నష్టపోతున్నారు.

రెండేళ్లుగా ఏబీసీ సెంటర్ మూసివేత

సిద్దిపేటలోని పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) అలంకారప్రాయంగా మారింది. వీధి కుక్కల నియంత్రణ కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు 2021లో ఏప్రిల్ 10న ఏబీసీ సెంటర్‌ను రూ. 36.50 లక్షలు నిధులు కేటాయించి ప్రారంభించారు. ఆ తర్వాత దాదాపు 3200కు పైగా వీధి కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబనియంత్రణ ఆపరేషన్‌ను నిర్వహించారు. వాటిని వారం రోజుల పాటు సంరక్షించి తరువాత వదిలేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా, మార్చి 2022 నుంచి రెండేళ్లకు పైగా ఏబీసీ కేంద్రం తెరుచుకోలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏమాత్రముందో అర్థమవుతున్నది.

వైద్యుడిని సంప్రదించాలి



- డాక్టర్ కిషోర్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్ ఆసుపత్రి, సిద్దిపేట

ఎవరైనా కుక్కకాటుకు గురైతే స్థానిక పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైదుడిని సంప్రదించాలి. జిల్లా వ్యాప్తంగా ఏఆర్‌వీ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నాయి. సొంత వైద్యం చేసుకోకుండా వెంటనే ఇంజక్షన్ తీసుకోవాలి. తద్వారా వైరస్ శరీరంలోకి వ్యాపించకుండా అడ్డుకట్ట వేసినవారమవుతాం. ఆలస్యం చేస్తే వైరస్ సోకి ప్రాణానికే ప్రమాదమయ్యే అవకాశముంది. వీధికుక్కలున్న చోట చిన్నారులను ఒంటరిగా బయటకు పంపించకుండా ఎవరైన పెద్దవారు తోడుగా వెళ్లాలి.

ఆశ నిరాశ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ ఈ బడ్జెట్‌ను రైతులు, నిరుద్యోగుల బడ్జెట్‌గా అభివర్ణిస్తోంది. విపక్షాలు మాత్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించారని అంటున్నారు. తెలంగాణ ప్రయోజనాలను, ఇక్కడి ప్రజల ఆకాంక్షలను ఏ మాత్రం పట్టించుకోలేదని అంటున్నారు. ఉమ్మడి జిల్లా పలు రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశించగా, బడ్జెట్‌లో రైల్వేలకు సంబంధించి ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. పలు చోట్ల రైళ్ల హాల్టింగ్‌కు డిమాండ్ ఉండగా.. ఈ బడ్జెట్‌లో వాటిలో కొన్నింటిని అయినా నెరవేరుస్తారని భావించినా ఫలితం దక్కలేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలనూ పట్టించుకోలేదు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయడం, నిరుద్యోగుల ఉపాధి కల్పనపై దృష్టి పెట్టడంతో సానుకూలత వ్యక్తమవుతోంది. ఆదాయపన్ను సవరింపుతో వేతన జీవులకు ఊరట లభించింది.

- సిద్దిపేట టౌన్/గజ్వేల్
జూలై 23

● కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన
● తెలంగాణపై బీజేపీది సవతితల్లి ప్రేమ : కాంగ్రెస్
● రాష్ట్రానికి ఈసారి నిరాశే: బీఆర్ఎస్
● మోదీ ప్రభుత్వానిది సంక్షేమ బడ్జెట్: బీజేపీ
● కేంద్ర మంత్రులుండి ఏం లాభం: సీపీఐ

మహిళలకు ఊరట



- డాక్టర్ సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌లో మహిళలకు కాస్త ఊరట లభించింది. మహిళలు ఎక్కువగా ఇష్టపడే బంగారు, వెండి ఆభరణాలపై గతంలో 10శాతం కస్టమ్ డ్యూటీ విధించేవారు. ఇప్పుడు దాన్ని తగ్గించి 6శాతం చేశారు. గతంలో రూ. 5లక్షల పైబడి సంపాదన ఉంటే 5శాతం టాక్స్ విధించేవారు. ఇప్పుడు 3 శాతం దాటితే టాక్స్ విధిస్తున్నారు. దీంతో చిన్నస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉంటుంది. ఉద్యోగుల జీతాలు పెంచుతూ ఇన్‌కమ్ టాక్స్ రూపంలో ప్రభుత్వం వసూలు చేస్తున్నట్లు అనిపిస్తుంది.

ప్రజల కంటే మిత్రులకే ప్రాధాన్యం



- కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజాప్రయోజనాల కంటే తమ మిత్రపకాలపైనే ప్రేమ ఎక్కువగా ఉంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న తెలంగాణ ప్రజానీకానికి నిరాశే మిగిలింది. నిధుల కేటాయింపులో సమాన వాటా ఇవ్వాలి. కానీ తమకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాలకు, తమ మిత్రపక్షాలు పాలించే రాష్ట్రాలకు పెద్దపీట వేశారు. 8 మంది ఎంపీలను గెలిపించిన తెలంగాణ ప్రజల నమ్మకాన్ని మరోసారి ఈ బడ్జెట్ రూపంలో వంచించే ప్రయత్నం చేశారు.

బడ్జెట్‌లో పస లేదు



- పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు

మిత్రులకు, మిత్రపక్షాలకు ఉపయోగం తప్ప ఈ బడ్జెట్‌లో పస లేదు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న పలు హామీలను బడ్జెట్‌లో చేర్చి కాపీ పేస్ట్ చేశారు. మిత్రపక్షాలపైన ఏపీ, బీహార్‌కు పెద్దపీట వేశారు. మోదీ కేవలం రాజకీయ పబ్బం గడుపుకునేందుకు వన్ నేషన్ అంటారే తప్ప నిజానికి ఆయనకు దేశం మీద ప్రేమ లేదు. సిద్దిపేటలో కేవలం నామమాత్రంగానే రైలు కొనసాగుతున్నది. విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసి సిద్దిపేట నుంచి పలు తీర్థయాత్రలకు వెళ్లేలా మార్గాలను ఎందుకు వేయడం లేదు. బీజేపీది మొదటి నుండి తెలంగాణపై సవతి తల్లి ప్రేమ కనబరుస్తోంది.

ఉపాధిహామికి తగ్గిన నిధులు ఏవీ?



- పి.శంకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి

బడ్జెట్‌లో ఉపాధిహామీకి తగినన్ని నిధులు కేటాయించలేదు. 2024-25 సంవత్సరానికి గ్రామీణ ఉపాధి చట్టానికి రూ.86వేల కోట్లను మాత్రమే కేటాయించారు. 2023-24 సంవత్సరానికి రూ.86వేల కోట్లు కేటాయించారు. 2023-24 సంవత్సరానికి గ్రామీణ ఉపాధి చట్టానికి అయిన ఖర్చు రూ.లక్షా ఐదు వేల కోట్లు.. అంటే గతేడాదితో పోల్చితే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు రూ19,300కోట్లు తక్కువ. ఈ సంవత్సరం మొదటి మూడు నెలల్లో గతేడాది మొదటి మూడు నెలల కంటే 5.74కోట్ల పనిదినాలు ఎక్కువయ్యాయి. ఈ బడ్జెట్ కనీసం పెరిగిన డిమాండ్‌ను, ద్రవ్యోల్బణం, సవరణ వేతన రేటుతో పాటు ప్రతిబింబించలేదు.

తెలంగాణకు మొండిచేయి



- మంద పవన్, సీపీఐ జిల్లా కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపించారు. విభజన హామీల సందర్భంగా ఇచ్చిన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, అధిక నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. తక్షణమే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు, బీజేపీ పార్లమెంట్ సభ్యులు రాజీనామా చేయాలి. కోటీశ్వరుల ఆభరణాలైన వజ్రాలు, బంగారం సుంకం తగ్గించారు. సామాన్యుల ఆభరణ, అలంకరణ, అవసరమైన ప్లాస్టిక్ సుంకం పెంచారు. ఫోన్, చార్జర్ సుంకం రేటు తగ్గించి రీచార్జ్ ధరల పెంపునకు అనుమతినిచ్చారు. వ్యవసాయానికి అవసరమైన నత్రజని సంబంధిత మూలకాలపై సుంకం పెంచడం వల్ల ఎరువుల ధరలు పెరగనున్నాయి.

సంక్షేమ బడ్జెట్



- గంగాడి మోహన్‌రెడ్డి, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు

వ్యవసాయ బడ్జెట్ రైతుల సంక్షేమానికి రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించడం అభినందనీయం. చిన్న, సన్నకారు రైతులు కూరగాయలు సాగు చేసుకోవడానికి ప్రోత్సాహకాలు ఇచ్చారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌కు అధిక నిధులు కేటాయించడం, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం హర్షణీయం. ఇది యువతరం కలలు నెరవేర్చే బడ్జెట్. గృహ నిర్మాణానికి రూ. 2.20 లక్షల కోట్లు కేటాయించడం అభినందనీయం. 500 పెద్ద కంపెనీల్లో కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పన అనేది నిరుద్యోగులకు వరం లాంటిది. 100 నగరాల్లో ప్లగ్ అండ్ ప్లే తరహాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు, ముద్ర రుణాలు రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడం ఉపాధి కల్పన నైపుణ్య శిక్షణలపై ప్రత్యేక దృష్టి కేటాయించింది.

నిరుద్యోగులను మోసం చేసేలా బడ్జెట్



- బండ్ల స్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

ఈ బడ్జెట్ నిరుద్యోగులను మోసం చేసేలా ఉంది. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని చెప్పి బడ్జెట్‌లో జిమ్మిక్కులకు పూనుకుంది. నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో కొత్త ఉపాధిని కల్పిస్తామనే వంకతో కార్పొరేట్లకు సబ్సిడీ ఇచ్చే మరో మార్గంగా కనిపిస్తుంది. గతంలో నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు 18శాతం మించి ఉద్యోగాలు రాలేదు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరిగిపోతుంది. ఈ బడ్జెట్ మరోసారి నిరుద్యోగులను మోసం చేసే విధంగా ఉంది.

ఆంగ్లభాషపై పట్టుసాధించాలి

● కలెక్టర్ మనుచౌదరి
● పున:ప్రారంభమైన స్కూళ్ల సందర్శన
● గతంలో మూతపడటానికి కారణాలపై ఆరా



కోహెడ మండలం శనిగరం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కోహెడ/బెజ్జంకి/సిద్దిపేటఅగ్రికల్చర్ జూలై 23 : విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తును సాధిస్తారని కలెక్టర్ ఎం.మనుచౌదరి సూచించారు. మంగళవారం కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, 15 ఏళ్ల క్రితం మూతపడి ఇటీవల పున:ప్రారంభమైన బెజ్జంకి మండలం పోతారంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనిగరంలో పాఠశాలను తనిఖీ చేసినపుడు పదో తరగతిలో ఇంగ్లిష్ క్లాస్ జరుగుతుండడంతో భాషా పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఓ చిన్నారితో అక్షరాలు దిద్దించారు. చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహారాన్ని క్రమ తప్పకుండా అందించాలని, ప్రతినెలా ఎత్తు, బరువు కొలవాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. కిచెన్‌షెడ్ ముందు రేకులు ఏర్పాటు చేయాలని, ఇదే ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న పాత బిల్డింగ్ భవనాన్ని కూల్చివేయాలని పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం మూతపడిన సోమారపు ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కన్నపేట, కోహెడ మండలాల్లో దాదాపు 15 పాఠశాలలో మూతపడ్డాయని, మూతపడడానికి గల కారణాలు తెలుసుకొని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలను వివరించి విద్యార్థులు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు ఫలితాల్లో 10 జీపీఏ తెచ్చుకోవాలని సూచించారు. ఆయన కాచాపూర్ మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రెండేళ్లుగా మూతపడిన పాఠశాలకు మళ్లీ విద్యార్థులను చేర్పించినందుకు విద్యాశాఖ అధికారులను, గ్రామస్తులను అభినందించారు. పాఠశాలకు అవసరమైన తాగునీరు, విద్యుత్ కనెక్షన్, మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్, పాఠశాలకు అవసరమైన రిపేర్లను పూర్తిచేయిస్తానని, అవసరమైన ఫర్నీచర్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే బెజ్జంకి మండలం పోతారం పాఠశాలలోని సమస్యలు గ్రామస్థులు కలెక్టర్‌కు వివరించడంతో మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని ఆయన తెలిపారు. మూతపడిన పాఠశాలలను తెరుచుకునేలా కృషి చేసిన గ్రామస్తులను ఆయన అభినందించారు. ఆ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి పుట్టినరోజు కావడంతో పెన్సిల్ బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మహమూద్, కమ్యూనిటీ మొబలైజర్ పద్మయ్య పాఠశాల ఉపాధ్యాయులు కిషన్, పంచాయతీరాజ్ ఏఈ మాజీద్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మహేష్, సెక్టోరల్ అధికారులు రామస్వామి, రంగనాథ్, ఎంపీడీవో లక్ష్మప్ప, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో విష్ణు, ఎంఎల్‌వో మహాతిలక్ష్మీ, పంచాయతీరాజ్ శాఖ అధికారి సమ్మయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ మనుచౌదరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెంపుపై కలెక్టరేట్‌లో మండల విద్యాశాఖ, మండల విద్యాశాఖ నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చూడాలని, అన్ని పాఠశాలల్లో టెక్స్ట్‌బుక్స్ పంపిణీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆదర్శంగా తీసుకుని అడ్మిషన్ కోసం పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీపీవో

'స్టీల్ బ్యాంక్' దేశానికే ఆదర్శం

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు జిల్లాలో వినూత్నంగా అమలవుతున్న స్టీల్ బ్యాంక్ కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సమక్షంలో జిల్లా పంచాయతీ విభాగం తరపున కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్టీల్ బ్యాంక్ ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పంచాయతీ, మున్సిపల్ సంబంధిత శాఖల అధికారులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో డివిజన్ పంచాయతీ అధికాలు, మండల పంచాయతీ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సాగుదామిలా..
● పంటల రక్షణకు యాజమాన్య పద్ధతులు
● స్వల్పకాలిక రకాలు మేలు
● తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి
7 లో

'ఫార్మా, రసాయన పరిశ్రమలను తరలించాలి'

పంజాగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ ఖాజీపల్లిలో కాలుష్యం వెదజల్లుతున్న ఫార్మా, రసాయన పరిశ్రమలను తరలించాలని ఖాజీపల్లి గ్రామ జేఏసీ చైర్మన్ రమాకాంత్ దండే డిమాండ్ చేశారు. హీరో ప్రభాస్ దత్తత తీసుకున్న అటవీ ప్రాంతం తమ గ్రామ పరిధిలో ఉన్నదన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడారు.

దత్తత తీసుకున్న అమ్మాయిని బాగా చదివించాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దంపతులకు ఆడ శిశువును దత్తతగా ఇస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 23: దత్తత తీసుకున్న అమ్మాయిని బాగా చదివించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో మంగళవారం ఆడ శిశువును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాకు చెందిన దంపతులకు అదనపు కలెక్టర్ అధికారికంగా దత్తతగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె అమ్మాయిని బాగా చదివించాలని, తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సాహం ఇవ్వాలని, అమ్మాయి బంగారు భవిష్యత్‌కు బాటవేసే పూర్తి బాధ్యత మీదనని తెలిపారు. జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, బాల రక్ష భవన్ కో ఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, శిశు గృహ మేనేజర్ ఝాన్సీ, శిశుగృహ సామాజిక కార్యకర్త రాజారామ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట స్టీల్ బ్యాంక్ గుర్తింపు హరీశ్‌రావుకే దక్కుతుంది



సమావేశంలో విజయ సంకేతం చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, తదితరులు

సిద్దిపేట టౌన్, జూలై 23: జాతీయస్థాయిలో సిద్దిపేట స్టీల్ బ్యాంక్‌కు గుర్తింపు రావడం ఆనందంగా ఉన్నదని, ఆ గుర్తింపు ఘనత మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకే దక్కుతుందని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మలు వేర్వేరుగా జరిగిన సమావేశంలో తెలిపారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రోజాశర్మ, మున్సిపల్ కార్యాలయంలో మంజులారాజనర్సులు మాట్లాడుతూ ప్రతి ఏడాది కేంద్రం వెలువరించే పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ ప్రస్తావన రావడం గర్వంగా ఉన్నదన్నారు. సిద్దిపేట పట్టణం సుమారు 1.57 లక్షల జనాభాను కలిగి ఉన్నదని, పట్టణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ఆలోచనతో దానిని నివారించేందుకు హరీశ్‌రావు స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారని వివరించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాటి సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, బాలవికాస సంస్థ సహకారంతో మొదట సిద్దిపేటలోని 4వ వార్డులో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. హరీశ్‌రావు సూచన మేరకు అన్నివార్డులతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు గోపాలపురం దీప్తినాగరాజు, గ్యాదరి రవి, ధర్మవరం బ్రహ్మం, పసకుల సతీష్, మోయిద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, పాల సాయిరాం, మోహన్‌లాల్, భూపేశ్, ఎడ్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాగుదామిలా..

- పంటల రక్షణకు యాజమాన్య పద్ధతులు
- స్వల్పకాలిక రకాలు మేలు
- తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి

సిద్దిపేట రూరల్, జూలై 23: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నుంచి పంటల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి తెలిపారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పంట పొలం నుంచి మురుగునీటిని తీసివేయాలని చెప్పారు. రాబోయే మూడురోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని చెప్పారు.

వరి పంటలో..

నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక (120-125 రోజుల) వరి రకాల నారుమళ్లు జూలై 31వ తేదీవరకు పోసుకోవడానికి అనువైన సమయం ఉంటుంది. 30 నుంచి 25 రోజుల వయస్సు ఉన్న మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను నాటు వేసుకోవాలి. దీర్ఘకాలిక వరి రకాల నారు బాగా ముదిరి (50 రోజుల వయస్సు) ఆలస్యంగా నాటినప్పుడు ఆకు చివరలను తుంచి వేసి కుదురుల సంఖ్యను పెంచి కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటువేయాలి. నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25 శాతం పెంచి మూడుదఫాలుగా, రెండు దఫాలుగా అంటే 70 శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేసుకోవాలి. వరినాట్లు వేసుకునే వారంరోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను ఇసుకలో కలిపి చల్లినట్లయితే ప్రధాన పొలంలో పంటను 15-20 రోజుల వరకు కొన్నిరకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చు. ఇప్పటివరకు నార్లు పోయని రైతాంగం, వర్షాలను సద్వినియోగం చేసుకుని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవడం వల్ల సమయంతో పాటు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు. వరినాటు పెట్టిన తర్వాత ప్రతి 2 మీటర్లకు కాలిబాటను తీయటం వల్ల గాలి వెలుతురు బాగా ప్రసరించడంతో పాటు సుడిదోమ ఉధృతిని నివారించవచ్చు. అదేవిధంగా రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుంది. ముందస్తు చర్య నివారణలో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను నాటిన 10 నుంచి 15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించుకోవచ్చని తెలిపారు.



జొన్న పంటలో..

ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా జొన్న పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు, పంట విత్తిన 30-35 రోజుల దశలో ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను కాండము సుడులలో వేయాలన్నారు.

కంది పంటలో..



ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో ఫైటాప్తోర ఎండుతెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో, నివారణకు 2 గ్రా. మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలని సూచించారు.



వేరుశనగ పంటలో..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వేరుశనగలో మొదలుకుళ్లు తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు మొక్కల మొదళ్ల దగ్గర 2 గ్రాముల కార్బండజిమ్+మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.

పత్తి పంటలో..



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను 20 రోజుల నుంచి 40 రోజుల వయసున్న పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం. మీ దూరంలో పాదులుతీసి వేసి మట్టితో కప్పాలి. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నివారించుటకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్+మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పత్తి పంటలో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి (2 నుంచి 3 ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలు) 2 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్+1.25 మి.లీ. పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



మొక్కజొన్న పంటలో..

మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు. కాబట్టి పొలం నుంచి నీటిని తీసివేయాలి. అధిక వర్షాల వల్ల నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రా. 19-19-19 లేదా 20 గ్రాముల డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. మొక్కజొన్న పంటను జూలై 31వ తేదీవరకు స్వల్పకాలిక రకాలను దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా విత్తుకొనుటకు అనుకూల సమయం. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవచ్చు. వర్షాలు తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలని చెప్పారు.

చెరకు పంటలో..



ముంపుకు గురైయ్యే ప్రాంతాల్లో ప్రతీ 25 మీటర్లకు ఊట కాలువలు ఏర్పాటు చేసుకుని తోటలో నీరు నిలువకుండా మురుగునీటి కాలువల ద్వారా నీటిని తీసివేయాలి. రైతులు వర్షాలు పడుతున్న సందర్భంలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట రక్షణతో పాటు అధిక అధిక దిగుబడి సాధించవచ్చునని చెప్పారు. రైతులు పూర్తి వివరాలకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం తోర్నాల సంప్రదించాలని, పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు రైతులు సందేహాలు తెలిపితే నివారణ మార్గాలను సూచిస్తారని తెలిపారు.

కూరగాయల సాగులో..



టమాట, వంగ, మిరప, బంతి పంటల నారుమళ్లలో నారు కుళ్లు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కూరగాయల పంటల్లో ఆకుమచ్చ తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 3 గ్రా. కార్బెండజిమ్ లేదా 1మి.లీ. ప్రోపికోనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.



సోయాచిక్కుడు పంటలో..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో వేరుకుళ్లు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో, నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. సోయాచిక్కుడు పంటలో కాండం కుళ్లు తెగులు గమనించినట్లయితే 2.5గ్రా కార్బండాజిమ్+మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల వల్ల 25 రోజుల పంటలో అంతరకృషి చేయడం వీలుకాని చోట 250మి.లీ. ఇమాజితాపిర్ 10శాతంఎస్ఎల్ లేదా 40గ్రా. ఇమాజితాపిర్+ఇమాజమాక్స్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి గడ్డి, వేడల్పాకు కలుపు జాతి మొక్కలను నివారించాలన్నారు.

భూమి విషయంలో అధికార పార్టీ నేతల దౌర్జన్యం

- న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

మెదక్ అర్బన్, జూలై 23: పంట భూమి విషయంలో అధికార పార్టీకి చెందిన నేతల తమపై దౌర్జన్యం చేస్తూ దాడిచేశారని తమకు న్యాయం చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు రమావత్ బుజ్జి, శంకర్, యమునా, అనిల్ మాట్లాడుతూ.. టేక్మాల్ మండల పరిధి షాబాద్‌తండాలోని సర్వేనెంబర్ 86లో 360 ఎకరాల అటవీ భూమి ఉందన్నారు. ఇందులో 150 ఎకరాల భూమికి పట్టాలు ఇవ్వగా.. మిగతా భూమిని గిరిజనులకు పోడు వ్యవసాయం కింద సాగు చేసుకుంటున్నామన్నారు. అధికార పార్టీకి చెందిన సేవాలాల్, ప్రకాష్, దినేష్ మా భూమిలో హద్దులను చెరిపేస్తుంటే అడ్డుకున్నామన్నారు. దాంతో మాపై గొడ్డలి, కట్టెలతో దాడిచేసి చంపే ప్రయత్నం చేశారని, మహిళలు అని చూడకుండా దూషిస్తూ కొట్టారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా తమపైనే కేసులు నమోదు చేశారని తెలిపారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఎస్పీని కోరిన్నట్లు బాధితులు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే

అధికార పార్టీల నేతల దాడిలో గాయపడి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న బాధితులను మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించి మాట్లాడారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపించారు. వెంటనే దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని కోరినట్లు ఆయన తెలిపారు.



పొంగి పొర్లుతున్న ఘనపురం

పాపన్నపేట, జూలై 23: ఇటీవల కురిసిన వర్షాలతో మంజీరా నదికి వరదలు పోటెత్తాయి. పరవళ్లు తొక్కుతున్న మంజీరా ఘనపురం ప్రాజెక్టును చేరింది. మంగళవారం ఉదయం నుంచి ఆనకట్ట పొంగిపొర్లుతూ దుర్గమ్మ ఆలయం ముందు నుంచి దిగువకు ప్రవహిస్తుంది. ఆయకట్టు పరిధిలోని సుమారు వేల ఎకరాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

యంత్రంతో వరినాట్లు

- కూలీలు దొరక్కపోవడంతో యంత్రాల వైపు రైతుల మొగ్గు
- ఖర్చు తక్కువ.. సమయం ఆదా

అక్కన్నపేట, జూలై 23: వానాకాలంలో వరి సాగుచేసేందుకు ముందుకొచ్చిన అన్నదాతలకు నాట్ల సమయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సమయానికి నాట్లు వేయక దిగుబడి తగ్గుతున్నది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు వ్యవసాయ యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సీజన్‌లో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో యంత్రం సాయంతో వరినాట్లు వేస్తున్నారు. మంగళవారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో వరి యంత్రంతో రైతులు నాట్లు వేశారు. వరినాటు యంత్రంతో నాట్లు వేస్తే ఎకరానికి రూ.4 వేలు తీసుకుంటున్నారు. అదే కూలీలతో నాట్లు వేస్తే ఎకరానికి రూ.6 వేల ఖర్చు వస్తుంది. దీంతో ఎకరానికి రూ.2 వేల వరకు ఖర్చు తగ్గుతుందని, సమయం కూడా ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కూలీల కొరతను అధిగమించి సరైన సమయానికి నాట్లు వేయొచ్చని చెబుతున్నారు.



అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో యంత్రంతో వరి నాట్లు వేస్తున్న రైతులు

కూలీలు దొరక్కపోవడంతో..

కూలీలు దొరక్కపోవడంతో యంత్రంతో వరినాటు వేయించాను. సమయం ఆదాతో పాటు.. ఖర్చు తక్కువగా అవుతుంది. యంత్రంతో నాటు వేస్తే రూ.4 వేలు అవుతుండగా.. కూలీలతో వేయిస్తే రూ.6 వేలు వరకు అవుతుంది. యంత్రంతో నాలుగు ఎకరాలు నాటు వేయించాను.

\- పీచర వెంకటేశ్వరరావు, రైతు, గోవర్ధనగిరి

బాలురతో సమానంగా బాలికలకూ హక్కులు

- లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా అంగన్‌వాడీలు చూడాలి
- జిల్లా సీనియర్ న్యాయాధికారి రమేశ్



మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయాధికారి రమేశ్

జోగిపేట, జూలై 23: సమాజంలో బాలురతో సమానంగా బాలికలకూ హక్కులుంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయాధికారి రమేశ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్తాధ్వర్యంలో మిషన్ శక్తి-100 రోజుల ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం.. బాల బాలికలంతా సమానమేనన్నారు. బాలురతో పాటు బాలికలకూ సమాన హక్కులుంటాయని వివరించారు. ఈ హక్కులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అలాగే లింగ నిర్ధారణ జరిపే పరీక్షలను నిలువరించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉన్నదని చెప్పారు. అనంతరం అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల పిల్లల ఆరోగ్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. పోక్సో చట్టం గురించి కిశోర బాలికలకు, అవగాహన కల్పించి, వారిని చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి లలితకుమారి, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, సీడీపీవో ప్రియాంక, ఎంపీడీవో రాజేశ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

షేర్‌మార్కెట్‌లో లాభాలంటూ రూ.కోటికి కుచ్చుటోపీ

- పోలీసులకు ఫిర్యాదుతో రూ.24 లక్షలు రికవరీ
- పటాన్‌చెరులో సైబర్ నేరం

పటాన్‌చెరు, జూలై 23: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే లాభాల వర్షం కురుస్తుందన్న సైబర్ నేరగాళ్ల మాయమాటలకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఏకంగా రూ.కోటి పోగొట్టుకున్నాడు. సకాలంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అందులో రూ.24 లక్షలు రికవరీ చేయగలిగారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో వెలుగు చూసిన ఈ సైబర్ నేరం వివరాలు పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణ శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉండే బెజవాడ నాగార్జున (36) బెంగళూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో చిన్నమొత్తాలను పెట్టుబడులుగా పెట్టి, లాభాలు పొందడం అతనికి అలవాటు. జూలై 5న నాడియాకమీ అనే గుర్తుతెలియని మహిళ.. నాగార్జున వాట్సాప్‌కు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని మేసేజ్ పంపించింది. పెట్టుబడులు పెట్టాల్సిన సంస్థలను తాము సూచిస్తామని లాభాలు తెచ్చిపెట్టే బాధ్యత తమదని నమ్మించింది. దీంతో బెజవాడ నాగార్జున వారు సూచించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. పలు దఫాలుగా చిన్న మొత్తాలను పెట్టుబడి పెట్టి లాభాలు పొందాడు. నమ్మకం కుదిరిన తరువాత ఏకంగా రూ.99,78,527లు పలు యాప్‌ల ద్వారా పెట్టుబడుల రూపంలో బదిలీ చేశాడు. అయితే, వచ్చిన లాభాలు తన బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడాన్ని గమనించిన నాగార్జున మోసపోయానని గ్రహించాడు. సోమవారం అర్ధరాత్రి పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే సైబర్ క్రైం సెల్ 1930కి ఫోన్ చేయడంతో సైబర్ నేరాగాళ్ల అకౌంట్‌లలో బదిలీ కాకుండా ఉన్న రూ. 24 లక్షలను రికవరీ చేశారు.

యువతికి తెలియకుండానే పర్సనల్ లోన్

- రూ.5 లక్షలు నొక్కేసిన సైబర్ నేరగాళ్లు

తూప్రాన్, జూలై 23: ఆమెకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు పర్సనల్ లోన్ తీసుకుని, అందులో నుంచి రూ.5 లక్షలు కాజేసిన ఉదంతం తూప్రాన్‌లో సోమవారం వెలుగు చూసింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలో నివాసముండే ఓ యువతికి మొబైల్‌కు ఫోన్ చేసి ఇంటర్నేషనల్ కొరియర్ వచ్చిందని చెప్పారు. తాను ఎలాంటి కొరియర్ బుక్ చేయలేదని, ఆ కొరియర్ తనది కాదని చెప్పింది. కొరియర్ మీది కాకుంటే ఒకటి నొక్కడంటూ చెప్పడంతో ఆమె నమ్మి వారు చెప్పినట్లు చేసింది. ఆ తర్వాత సైబర్ క్రైం బ్యూరో అంటూ కాల్ చేసి కొరియర్ గురించి మాట్లాడితే తనది కాదంటూ కాల్ కట్ చేసింది. అయితే, మొదటిసారి కాల్ చేసినప్పుడే ఆమె వివరాలు సేకరించిన సైబర్ దొంగలు.. ఐసీఐసీఐ నుంచి ఆమె పేరిట రూ.6 లక్షల పర్సనల్ లోన్ తీసుకున్నారు. తర్వాత స్కైప్ వీడియో కాల్ చేసి ఐసీఐసీఐ బ్యాంక్ వెరిఫికేషన్ అంటూ ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు చెప్పారు. అవన్నీ తనవే కావడంతో ఆమె అయోమయానికి గురైంది. తర్వాత అవతలి వారు మీ బ్యాంక్ ఖాతాలో రూ.6 లక్షలు వచ్చాయి, చెక్ చేసుకోమని సూచించారు. దీంతో ఆ యువతి తన మొబైల్‌లో బ్యాంక్ యాప్ ఓపెన్ చేయగా.. ఫోన్ పని చేయలేదు. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి వివరాలు పరిశీలించగా, తనకు తెలియకుండానే రూ.6 లక్షల రుణం తీసుకున్నట్లు, అందులో రూ.5 లక్షలు బదిలీ జరిగినట్లు ఉంది. దీంతో ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముదిరిన వివాదం.. కబేళాకు తాళం

- ఏడుపాయల్లో ఉద్రిక్తత

పాపన్నపేట, జూలై 23: పాపన్నపేట కబేళా వివాదం చివరకు గేటుకు తాళం పడే పరిస్థితికి దారితీసింది. కబేళా కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించడంతో ఈవో క్రిష్ణప్రసాద్, ఎస్ఐ నరేష్ కలిసి గేటుకు తాళం వేసిన సంఘటన మంగళవారం జరిగింది. తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల్లో జంతు బలి నిషేధం ఉంది. కానీ వేలాది భక్తులు అనునిత్యం మేకలు, గొర్రెలు కోసుకుంటూ విందులు చేసుకుంటారు. దీంతో ఆలయానికి కొంత ఆదాయం సమకూర్చాలని, పరిసరాల పారిశుధ్యం కాపాడాలని యోచించిన అప్పటి పాలకవర్గ చైర్మన్, నాటి ప్రజాప్రతినిధులు కలిసి మెదక్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు బేళా నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పారు. 2019లో ఆ కాంట్రాక్టర్ కబేళా కోసం తన సొంత ఖర్చులతో ఏడుపాయల్లో ఓ బిల్డింగ్ నిర్మించారు. ఒక మూగ జీవం కట్ చేయడానికి రూ.25 చొప్పున దేవస్థానానికి చెల్లిస్తూ ఐదేళ్లపాటు కబేళా నిర్వహించుకోవాలని ధర్మకర్తలు తీర్మానించారు. అయితే 10 కిలోల లోపు బరువు గల జీవానికి రూ.400 20 కిలోల లోపు రూ.500, 20 కిలోల పైన రూ.600 భక్తుల వద్ద నుంచి అతడు వసూలు చేసుకోవచ్చునని తీర్మానించారు.



ఏడుపాయల కబేళాకు తాళం వేస్తున్న ఈవో, ఎస్ఐ

అధిక వసూళ్లంటూ గ్రామస్థుల ఆందోళన

మేకల కట్ చేసే క్రమంలో భక్తుల నుంచి కాంట్రాక్టర్ విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఆరోపిస్తూ 31 మార్చి 2024న నాగ్సాన్‌పల్లి గ్రామస్థులు ఏడుపాయల్లో ఆందోళనకు దిగి, కబేళాకు తాళం వేసి, వారే వసూళ్లకు దిగారు. దీంతో పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ధర్మకర్తలు, మండల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఐదేళ్లలో జీవానికి రూ.25 చొప్పున చెల్లించాల్సిన కాంట్రాక్టర్ నయాపైసా చెల్లించలేదని, నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నాడంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కాంట్రాక్టర్‌ను తొలగించాలని నిర్ణయించారు. 1 ఏప్రిల్ 2024 నుంచి ఆలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో కబేళా నిర్వహిస్తున్నారు. గత తీర్మానం ప్రకారం తనకు ఇంకా 5 నెలల కాల పరిమితి ఉందంటూ సదరు కాంట్రాక్టర్ కోర్టు మెట్లు ఎక్కడం, కబేళాను తన ఆదీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నించడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఈవో క్రిష్ణప్రసాద్ పాపన్నపేట పోలీసుల సహాయంతో కబేళాకు తాళం వేశారు. ఈ విషయమై చైర్మన్ బాలాగౌడ్ మాట్లాడుతూ ఒక నెలలో సుమారు 1,500 మేకలు కోస్తారని, దానివల్ల ఆలయానికి ఎంత లేదన్నా నెలకు రూ.40 వేల ఆదాయం రావాల్సి ఉందన్నారు. ఈ లెక్కన చూస్తే కాంట్రాక్టర్ నిర్వహించిన 54 నెలలకు సుమారు రూ.20 లక్షల ఆదాయం రావాల్సి ఉందన్నారు. అలాగే నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ ధరలు వసూలు చేసి భక్తులను దోపిడీ చేయడంతో ధర్మకర్తలు, అధికారుల తీర్మానం మేరకు కబేళా కాంట్రాక్టర్‌ను తొలగించామన్నారు. ఈవో క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ వివాదం కోర్టు వరకు వెళ్లడంతో పాటు కొన్నిరోజులుగా కబేళా వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో కబేలా మూసివేశామని తెలిపారు.

రుణమాఫీ డబ్బులతో బలవంతంగా డిపాజిట్లు

- కొమురవెల్లి ఏపీజీవీబీ ఎదుట సీపీఎం ధర్నా

చేర్యాల, జూలై 23: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంట రుణమాఫీ చేస్తుండగా, రెన్యూవల్ పేరిట బ్యాంకు అధికారులు బలవంతంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించుకుంటుండటంతో ఉసూరుమంటున్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని ఏపీజీవీబీ అధికారులు పలువురు రైతుల నుంచి ఒక సంవత్సరం కాలపరిమితితో కూడిన డిపాజిట్లు చేయించడం వివాదాస్పదమవుతుంది. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తూ బ్యాంకు అధికారులు బలవంతంగా డిపాజిట్లు చేయించుకోవడం తగదని మండిపడుతూ సీపీఎం నాయకులు మంగళవారం బ్యాంకు ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ విషయమై పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఏపీజీవీబీ అధికారులు ఏ ప్రాతిపదికన బలవంతపు డిపాజిట్లు చేయించుకుంటున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత లక్ష్యాల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేయిడడం తగదని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ చేసి రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడూరి రవీందర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, బక్కెల్లి బాలకిషన్, తాడూరి మల్లేశం, ఉల్లంపల్లి సాయిలు, నీల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి ఏపీజీవీబీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏడాదికి తప్పనిసరి వస్తారని డిపాజిట్లు చేయిస్తున్నాం: ఇంచార్జి మేనేజర్ నరేశ్

డిపాజిట్ ఉంటే రైతులు ఆ డబ్బుల కోసం ప్రతీ ఏడాది విధిగా రెన్యూవల్ చేసుకోవడంతో పాటు అధిక వడ్డీ పడకుండా ఉంటుందని డిపాజిట్లు చేయించాం. బ్యాంకు రైతుల బాగుకోసమే ఆలోచిస్తుంది. సీపీఎం నాయకులు ధర్నా చేసినప్పటికీ ముగ్గురు డిపాజిట్ చేయించుకున్నారు. మేము ఎవరినీ బలవంతం చేయడం లేదు.

మొక్కలు నాటి సంరక్షించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



మొక్కను నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

హుస్నాబాద్ టౌన్, జూలై 23: మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని నాలుగో వార్డు కాశతురక కాలనీలో మంగళవారం నిర్వహించిన వనమహోత్సవంలో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత తదితరులున్నారు.

'రుణమాఫీతో రైతుల కళ్లల్లో ఆనందం'

కొండపాక, జూలై 23: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయడంతో రైతుల కళ్లల్లో ఆనందం విల్లివిరిసిందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొండపాక పీఏసీఎస్ వద్ద మంగళవారం రుణమాఫీ సంబురాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు మల్లేశం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రావస్థలో 'నిఘా నేత్రాలు'

● ప్రజాధనం వృథా
● ప్రజల భద్రతపై నీలినీడలు
● పట్టించుకోని అధికారులు

తొగుట, జూలై 23: అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడానికి గతంలో పోలీసులు బృహత్తర కార్యచరణ రూపొందించినప్పటికీ ఆచరణలో మాత్రం అది అమలుకు నోచుకోవడంలేదు. గతంలో తొగుట మండలంలోని కాన్గల్, ఎల్లారెడ్డిపేట, ఘనపూర్, బండారుపల్లి, తుక్కాపూర్, తొగుట, రాంపూర్, వెంకట్రావ్‌పేట, చందాపూర్, జప్తిలింగారెడ్డిపల్లి, లింగాపూర్, పెద్దమాసాన్‌పల్లి, ఎల్ బంజర్‌పల్లి, లింగంపేట తదితర గ్రామాల్లో పోలీసులు ప్రజల సహకారంతో లక్షల రూపాయలు వెచ్చించి సీసీ కెమరాలను ఏర్పాటు చేశారు. కానీ ఇపుడు అయా గ్రామాల్లో అవి పనిచేయకుండా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

ఏర్పాటు చేశారు.. నిర్వాహణ మరిచారు

సీసీ కెమరాలు ఏర్పాటు చేయడం పట్ల ఉన్న శ్రద్ధ వాటి నిర్వాహణ పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు చూపకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. మండల కేంద్రమైన తొగుటలో గతంలో వ్యాపార, వర్తక, వాణిజ్య సముదాయాల దుకాణ యజమానులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పోలీసులు సమావేశం నిర్వహించి, సుమారు లక్షా 50 వేల వరకు విరాళాలు సేకరించారు. వాటితో 10 సీసీ కెమరాలను తొగుట- సిద్దిపేట రహదారిపై గ్రామంలోని ప్రధాన వీధులవెంట ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను పోలీసుస్టేషన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టేలా ఏర్పాటు చేశారు. తొగుటలో మార్కెట్ యార్డు ముందు, పోలీసుస్టేషన్, బ్యాంక్‌లు, ఏటీఎంలు, గ్రామ పంచాయితీ దుకాణ సముదాయాలు, మార్కెట్‌యార్డు దుకాణ సముదాయాలు, పార్క్, పెట్రోల్‌పంప్, ప్రభుత్వ పాఠశాల, వైన్‌షాపు తదితర ప్రాంతాల్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రజాప్రతినిధుల, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి నిరూపయోగంగా మారాయి. దాంతో గ్రామాల్లో ఏదైనా సంఘటన చోటు చేసుకున్నా, ఎవరైనా అపరిచితవ్యక్తులు వచ్చినా, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమాచారం సేకరించడం పోలీసులకు ఇబ్బందిగా మారుతున్నది. ఇకనైన గ్రామల్లో సీసీ కెమరాలను పునరుద్ధరించి వాటి నిరహ్వాణ పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, ప్రజల భద్రత పట్ల తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తొగుటలో బస్‌షెల్టర్ ఎదుట రోడ్డుపై నిరుపయోగంగా ఉన్న సీసీ కెమరాలు



తొగుట మెయిన్ రోడ్డుపై నిరుపయోగంగా ఉన్న సీసీ కెమరాలు

సీసీ కెమెరాలతోనే భద్రత



సీసీ కెమెరాలతోనే ప్రజలకు భద్రత ఉంటుంది. ప్రతీ గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసుస్టేషన్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేయాలి. దాంతో గ్రామాల్లో ఏ సంఘటన జరిగినా ఇట్టే తెలిసిపోతుంది. శాంతిభద్రతల కోసం పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకున్నా మావంతు పూర్తి సహకారం అందిస్తాం.

- రామెళ్ల అనిల్‌కుమార్ (తొగుట)

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

తొగుట, జూలై 23: అప్పులబాధతో వ్యక్తిఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం లింగాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. తొగుట ఎస్‌ఐ రవికాంతరావు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన చేపూరి ఆంజనేయులుగౌడ్ (45) కొంతకాలం మహారాష్ట్రలో దేశిదారు దుకాణం నడిపాడు. ఈ క్రమంలో దుకాణం సరిగా నడవకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. దాంతో రెండేళ్ల క్రితం సొంత గ్రామానికి మకాం మార్చాడు. అప్పటి నుంచి అప్పులు తీర్చే మార్గం కానరాక మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. విసిగిపోయిన భార్య భాగ్యలక్ష్మి తన పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అతడు పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు, గ్రామస్థుల సహాయంతో అతడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆంజనేయులు మృతిచెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్‌ఐ తెలిపారు.

ఓట్లు కావాలి కానీ అభివృద్ధికి నిధులు ఇవ్వరా?

● తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్

మర్కుక్, జూలై 23 : కేంద్రానికి తెలంగాణ ప్రజల ఓట్లు కావాలి కానీ వాళ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి చేతులు రాలేదని మర్కుక్ మండల తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా తెలంగాణ సమాజం కళ్లు తెరవాలని, కేసీఆర్ రాష్ట్రానికి శ్రీరామరక్షని అన్నారు.

'విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి'

గజ్వేల్, జూలై 23: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యారంగానికి 30శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌లో కొఠారి కమిషన్ ప్రకారం 30శాతం నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగానికి గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వమైన విద్యారంగానికి నిధులు కేటాయించాలన్నారు. ఆయనవెంట యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీసభ్యులు నాచారం శేఖర్, నాయకులు సందీప్, వంశీ, దినేశ్, ప్రవీణ్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, జూలై23: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. పట్టణంలోని 6వ వార్డులోని వర్మీ కంపోస్టుయార్డులో తడి చెత్త ద్వారా ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఎరువును ఎప్పటికప్పుడు విక్రయించాలని నిర్వాహకులను ఆదేశించారు. బాలికల ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా నిర్మించిన మూత్రశాలలను, నీటి ట్యాప్ ఏర్పాట్లను, విద్యుత్ పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ.. రోజు పాఠశాలకు వస్తున్నారా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. వంటశాలలో భోజన తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈలు రంజిత్, అన్వేష్‌రెడ్డి, టీపీవో దేవరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, వనిత, మాధవి, నాయకులు పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట పట్టణంలోని వార్డు నెంబర్ 17, 19, 20, 21, 36, 37లలో నేడు మున్సిపల్ తాగునీరు సరఫరా బంద్ చేస్తున్నట్లు కమిషనర్ ప్రసన్నరాణి ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

● ఎంపీడీవో ఎస్. రామ్మోహన్

మద్దూరు, జూలై 23: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు నీటి నిల్వలు లేకుండా చూడాలని ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ సూచించారు. మండలంలోని రేబర్తి గ్రామాన్ని మంగళవారం ఎంపీవో ఖాజామొయినుద్దీన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువీధుల్లో నిలిచిన నీటిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తయారు చేసిన ఆయిల్‌బాల్స్‌ను వేయించారు. అనంతరం నర్సరీని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాదవ్‌జాదవ్, లద్నూరు వైద్యాధికారి స్టువర్ట్‌సన్, హెచ్‌ఏ దేవదాసు, ఏఎన్ఎం, మల్లేశ్వరి, ఆశాలు యశోద, కవిత, కనకలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, అనురాధ, ఫీల్డుఅసిస్టెంట్ అయిలయ్య తదితరులు ఉన్నారు.



రేబర్తిలో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న ఎంపీడీవో

అవగాహనతోనే వ్యాధులు దూరం

నంగునూరు, జూలై 23: అవగాహనతోనే వ్యాధులు అవుతాయని సిద్దిపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ హెచ్‌ఈ సత్యనారాయణ పేర్కొన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాలమాకుల గ్రామంలో మంగళవారం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో స్వామి, సూపర్‌వైజర్ అనురాధ, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట పదేళ్లు దోపిడీ

● బీజేపీ రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి

గజ్వేల్, జూలై 23: పదేళ్లలో గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట దోపిడి జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో వర్గల్ ఇండస్ట్రీయల్ పార్కు పేరిట రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వకుండా దొంగ నోటిఫికేషన్లతో వర్గల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 845, 1209, 1266, 371లోని భూములను ఆక్రమించుకునేందుకు యత్నించగా, హైకోర్టు జోక్యంతో నిలిచిపోయాన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోరాడి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో అనేక అక్రమాలు జరిగాయని, మునిసిపల్ భవనం ప్రారంభోత్సవం రోజున లక్షలాది రూపాయల ప్రజాధనం లూటీ చేశారని ఆరోపించారు. రూ.29లక్షలు దొంగ లెక్కలు రాసి తీసుకున్నారని విమర్శించారు. ఆయనవెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, శివకుమార్, కోదండం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామారెడ్డి, నాయిని సందీప్, మహిపాల్‌యాదవ్ తదితరులున్నారు.

రాజగోపాలపేట ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఆసిఫ్

నంగునూరు,జూలై 23: మండలంలోని రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా మహమ్మద్ ఆసిఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. అనురాధను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు.

ఆర్టీసీ సిబ్బందికి క్రీడల పోటీలు

సిద్దిపేట అర్బన్, జూలై 23: ఆర్టీసీ ఎంచుకున్న లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ సిబ్బందికి మంగళవారం క్రీడల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేసినట్లు డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, అసిస్టెంట్ ఇంజనీర్ రంజిత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరే కృష్ణపై చర్యలు తీసుకోవాలి

● గజ్వేల్‌లో కృష్ణ చిత్రపటం దహనం



ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, జూలై 23: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరే కృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం హైందవ సంఘాల నాయకులు, హిందూ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కృష్ణ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బుక్క రమేశ్‌గుప్తా, పూజారులు నందబాలశర్మ, శేషం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ.. హిందూ దేవతల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరే కృష్ణను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వారితో హైందవ సంఘాల నాయకులు, హిందూ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

● సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ



సిద్దిపేట క్రైం: అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

సిద్దిపేట క్రైం/నారాయణరావుపేట, జూలై 23: విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ సూచించారు. నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ నేరాలు, మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినిల రక్షణ కోసమే షీటీంలు ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలు రక్షణ, సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కిషన్ పవార్, కానిస్టేబుల్ లక్ష్మి, నారాయణ, ప్రవీణ్, మహిళా కానిస్టేబుల్ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సీపీఎం నాయకుల ఆరోపణలు తగవు'



మాట్లాడుతున్న మహదేవుని శ్రీనివాస్

చేర్యాల, జూలై 23: సీపీఎం నాయకులు రాజకీయ ఉనికికోసం పాకులాడుతూ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదని కాంగ్రెస్ కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేర్యాల వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ పదవిని రూ.55లక్షలకు కొమ్మూరి అమ్ముకున్నారని ఆరోపించిన సీపీఎం నాయకులు మధ్య వర్తులుగా వ్యవహరించారా లేదా ఆ డబ్బులను తామే ఇస్తే ఆధారాలు బయటపెట్టాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు లింగంపల్లి కనకరాజు, వుప్పల వంశీకృష్ణ, జంగని రవి, చెరుకు రమణారెడ్డి, పబ్బోజు రాములుచారి, లింగం, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

● టీజీ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి

చేర్యాల, జూలై 23: ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీజీ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి డిమాండ్ చేశారు. కొమురవెల్లి మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి అమలుచేయాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకనుగుణంగా ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ కొమురవెల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా నగవత్ భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా గ్యార ప్రవీణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో ఘనంగా గోరింట వేడుకలు



గోరింట వేడుకల్లో మహిళలు

చేర్యాల, జూలై 23: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గోరింట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వాసవి, గౌరీదేవతలకు పూజలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా గోరింటాకును చేతులకు పెట్టుకున్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు వేడుకలు నిర్వహించినట్లు మహిళా విభాగం అధ్యక్షురాలు తోట పద్మ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బాబునాయక్, ఏవో ప్రియదర్శిని

గజ్వేల్, జూలై 23: ప్రతీ రైతు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయాశాఖ ఏడీ ఎల్.బాబునాయక్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలో ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ఏఈవోలు, ఏవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 59 సంవత్సరాల వయసున్న రైతులు ఆగస్టు 4లోగా వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారితో ఏవో నాగరాజు, ఏఈవోలు ఉన్నారు.

ఇసుక వేలంతో రూ.2 లక్షల ఆదాయం

చిన్నకోడూరు, జూలై 23: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను పోలీసులు ఇటీవల సీజ్ చేశారు. ఆ వాహనాల్లో ఉన్న ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిల్వ చేసి అధికారులు మంగళవారం బహిరంగ వేలం వేశారు. 90 టన్నుల ఇసుకను వేలం వేయగా రూ. 2లక్షల 5 వేల ఆదాయం వచ్చింది. వేలంలో తహసీల్దార్ జయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రమ్యశ్రీ, ఆర్ఐ హరీశ్, జూనియర్ అసిస్టెంట్ కరుణాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

కోహెడ, జూలై 23: మండల కేంద్రంలో విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 119వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సామజిక కార్యకర్త పిడిశెట్టి రాజు, మాజీ సర్పంచ్ సుతారి కనుకయ్య, కిషన్, రాజు, గద్దెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలి

● సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య



మాట్లాడుతున్న సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, జూలై 23: సిద్దిపేట జిల్లాలో కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐ) డిస్పెన్సరీ లోకల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో ఈఎస్ఐ బీమా ఉన్న వారు సుమారు యాభైవేల మంది పైగా కార్మికులు ఉన్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, అనేక సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, జిల్లాలోని మున్సిపల్ కార్మికులు ఈఎస్ఐ పరిధిలో ఉన్నారని, కార్మికుల ఉద్యోగుల వేతనాల నుంచి ఈఎస్ఐకి ప్రతినెల లక్షలు జమవుతున్నాయన్నారు. కానీ కార్మికులకు మాత్రం ఈఎస్ఐ ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, సద్దాం, అశోక్, సుధాకర్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి'

సిద్దిపేట అర్బన్, జూలై 23: ఐఏఎస్ అయిన స్మితాసబర్వాల్ దివ్యాంగుల పట్ల అవహేళనగా మాట్లాడటం సరైనదికాదని దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపి పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన ఐఏఎస్ అధికారి దివ్యాంగుల పట్ల అనుచితంగా మాట్లాడటం సరైనది కాదని అన్నారు. దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విశిష్ట పురస్కార గ్రహీతకు సన్మానం

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 23: రాష్ట్ర శ్రీవైష్ణవ సంఘం పలు రంగాల్లో కృషి చేసిన వారికి అందించే పురస్కారాల్లో భాగంగా తనకు పత్రికారంగం నుంచి పురస్కారం అందించడం సంతోషంగా ఉందని సిద్దిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కే.రంగాచారి పేర్కొన్నారు. శ్రీవైష్ణవ సేవా సంఘం పురస్కారం అందుకున్న రంగాచారిని సిద్దిపేటలో జర్నలిస్టులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గుండారెడ్డిపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

కోహెడ, జూలై 23: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గుండారెడ్డిపల్లిలో గంటల రాజవ్వ అనే మహిళకు చెందిన ఇల్లు మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సుతారి కనుకరాజు, కొనవేణి కిషన్, పిల్లి బాబు కూలిన ఇంటిని పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నష్టం పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు.

'ప్రభుత్వం తప్పుదోవ పటిస్తున్నది'

చిన్నకోడూరు, జూలై 23: ప్రభుత్వానికి పాలన చేతగాక, బోగస్ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాలాయాపన చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు మేరుగు మహేశ్, రెడ్డి యాదగిరి ఆరోపించారు. మండలంలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టును మంగళవారం వారు సందర్శించి మాట్లాడారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ ప్రాజెక్టులో ఒక పిల్లర్ కుంగిపోతే ప్రాజెక్టు కూలిపోయే ప్రమాదంలో ఉందని, అవినీతి జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం మేడిగడ్డ ప్రాజెక్టు నీటితో నిండుకుండలా మారినా కొట్టుకపోవడం లేదని, వరద తీవ్రతను తట్టుకుని నిలబడిందని వారు తెలిపారు. తప్పుడు ప్రచారం చేసినందుకు బేషరతుగా మాజీ సీఎం కేసీఆర్, నాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిబాబు, ప్రశాంత్, భిక్షపతి, నాగరాజు, శేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్‌పై విద్యార్థులకు అవగాహన



కథలు చదువుతున్న విద్యార్థులు

మిరుదొడ్డి, జూలై 23: మండలంలోని చెప్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో పఠనాకార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు కిష్టారెడ్డి, లోకేశ్వర్, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులున్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

మిరుదొడ్డి, జూలై 23: అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని చిట్టాపూర్, పోతరెడ్డిపేట, ఎనగుర్తి, భూంపల్లి గ్రామాల్లో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ సంఘం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు చంద్రారెడ్డి, హరికృష్ణ తదితరులున్నారు.

వీరశైవాగమ గ్రంథాల విరాళం

చేర్యాల, జూలై 23: కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలోని వీరశైవాగమ వేదపాఠశాల విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన భక్తురాలు పత్తి మౌనికచంద్రశేఖర్ మంగళవారం వీరశైవాగమ గ్రంథాలను విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఈవో బాలాజీశర్మ చేతులమీదుగా వేదపాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు మహదేవుని మనోహర్, మహదేవుని రవి, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలి'

గజ్వేల్, జూలై 23: కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలని రాణే పరిశ్రమ బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమ ఎదుట బీఎంఎస్ 70 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఎంఎస్ వ్యవస్థాపకుడు దత్తోపంట్ టేంగ్డిజి చిత్రపటానికి పూలమాలవేసి, జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా రాణే పరిశ్రమ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. పరిశ్రమలలో మెరుగైన వేతన ఒప్పందం బీఎంఎస్ ద్వారానే జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు వి.యాదగిరి, కె. కనకయ్య, ఏ.నాగభూషణం, కె.దేవేందర్, బి.శివకుమార్, యం.దేవయ్య, కె.పరశురాం, ఎండీ. ఇమాముద్దీన్, కె.విజయ్‌కుమార్, కె.భాస్కర్, ఎం.బాలయ్య, ఎస్.సంజీవ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి'

సిద్దిపేట అర్బన్, జూలై 23: ముదిరాజ్ కులస్థులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో టీజీ ముదిరాజ్ మహాసభ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీజీ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ధర్మా ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చి హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు మిద్దె రవి, నాయకులు భైరి యాదగిరి, పరుశురాములు, జంగిటి నరసింహులు, సునీల్, శ్రావణ్, శ్రీనివాస్, గట్టు నర్సింహులు, నవీన్, శ్రీకాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ

కుకునూరుపల్లి, జూలై 23: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ బాధితుడికి అందజేశాడు. కొడకండ్లకు చెందిన అంజనేయులు తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో పోలీసులు సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకుని బాధితుడికి అందజేశారు. మండల కేంద్రంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముగ్గురు వాహనదారులు మద్యం సేవించి పట్టుబడ్డట్లు తెలిపారు. వారిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

సొంత డబ్బులతో విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ములుగు, జూలై 23: విద్యార్థులకు సేవ చేయడమే లక్ష్యంగా దుస్తులు పంపిణీ చేశానని ప్రధానోపాధ్యాయురాలు కవితాదేవి తెలిపారు. మండలంలోని మామిడాల ఆర్అండ్ఆర్ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు సొంత డబ్బుతో ఏకరూప దుస్తులు(స్పోర్ట్స్ దుస్తులు) ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.